విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, గురువారం 05, డిసెంబర్ 2024

రైతులకు భారీ నష్టం

విశాలాంధ్ర - ఉయ్యాలవాడ : మండలంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతులు అల్లాడిపోతున్నారు. చేతికి వచ్చిన వరి పంట కళ్ళ ముందే చేజారిపోతుంది. కోత దశలో ఉన్న వరి పంట పూర్తిగా నేలవాలి గింజలు రాలిపోతున్నాయి. ధాన్యాన్ని ఆరబెట్టి రైతుల పరిస్థితి మరి దారుణంగా ఉంది వర్షం కొంత ఎడితెరిపి ఇవ్వగానే ధాన్యాన్ని ఆరబెట్టే ప్రయత్నం చేస్తుండగా మళ్లీ వర్షం కురుస్తోంది. దీంతో రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు . ధాన్యానికి మూడు రోజులపాటు పట్టలు కప్పి ఉంచడం వల్ల ధాన్యం తడిసి మొలకలు వచ్చే ప్రమాదం ఉందని ధాన్యం కొనేందుకు వ్యాపారులు ముందుకు రాకపోవడంతో ప్రభుత్వమే ఆదుకోవాలని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో దాదాపుగా 500 హెక్టార్ల వరి పంట వేలాది బస్తాల ధాన్యం దెబ్బతినట్లు రైతులు వాపోయారు.

భూ సమస్యల పరిష్కార దిశగా రెవెన్యూ సదస్సులు

జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా...

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : గ్రామ స్థాయిలో భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించే ప్రాథమిక ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఈనెల 6 నుండి జనవరి 8 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. బుధవారం సీసీఎల్ఏ కార్యాలయం నుండి రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్, రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా రెవెన్యూ సదస్సులపై అన్ని జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్, డిఆర్ఓ రాము నాయక్ తదితరులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ గ్రామస్థాయిలో భూవివాదాలను పరిష్కరించేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున ఈనెల 6 నుండి జనవరి 8 వరకు రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందన్నారు. ఈనెల ఆరవ తేదీ నుండి జనవరి 8వ తారీకు వరకు నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం రెవెన్యూ సదస్సులు జరుగుతాయన్నారు. ఈ మేరకు సెక్షన్ 22ఏ భూ ఆక్రమణలు, ఫ్రీ హోల్డ్ భూములకు సంబంధించి బాధిత రైతులు రెవెన్యూ సదస్సులలో పాల్గొని అర్జీలు సమర్పించవచ్చని కలెక్టర్ తెలిపారు. షెడ్యూల్ ప్రకారం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారి, మండలంలో జిల్లాస్థాయి అధికారి నోడల్ ఆఫీసర్లుగా రెవెన్యూ సదస్సులలో పాల్గొంటారన్నారు. జిల్లా కలెక్టర్, జెసిలు ప్రతి నియోజకవర్గంలో జరిగే రెవెన్యూ సదస్సులకు హాజరవుతామన్నారు. రెవెన్యూ సదస్సులకు జాయింట్ కలెక్టర్ సమన్వయకర్తగా ఉంటారని కలెక్టర్ తెలిపారు.

కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు వేగవంతం

న్యాయశాఖ కార్యదర్శితో మంత్రి ఫరూక్ సమీక్ష



విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయడంలో భాగంగా కార్యాచరణకు శ్రీకారం చుట్టినట్లు రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ శాఖ విభాగం (లీగల్,లెజిస్లేటివ్ అఫైర్స్, జస్టిస్) కార్యదర్శిగా జి. ప్రతిభాదేవి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కర్నూలు ఫ్యామిలీ కోర్టు, నాలుగవ జిల్లా అదనపు సెషన్స్ జడ్జిగా పని చేస్తున్న ప్రతిభాదేవిని గత నెల 22వ తేదీన రాష్ట్ర న్యాయ విభాగం కార్యదర్శిగా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. రెండేళ్ల పాటు డిప్యూటేషన్ పై ప్రతిభాదేవి న్యాయశాఖ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్‌ను ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా న్యాయశాఖ కార్యదర్శి ప్రతిభా దేవి, మైనారిటీ సంక్షేమశాఖ కమిషనర్ సిహెచ్ శ్రీధర్ లతో మంత్రి ఫరూక్ న్యాయ మైనార్టీ సంక్షేమ శాఖలకు సంబంధించి వివిధ అంశాలపై చర్చించారు. మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ఇచ్చిన హామీ మేరకు కర్నూలులో హైకోర్టు శాశ్వత బెంచ్ ఏర్పాటుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోడమే కాకుండా, శాసనసభ, శాసనమండలిలో ఏకగ్రీవంగా ఆమోదించడం జరిగిందని పేర్కొన్నారు.

యురేనియం తవ్వకాలతో ప్రజాజీవితానికి ముప్పు

- కేంద్ర ప్రభుత్వం తక్షణమే తవ్వకాల టెండర్లను రద్దు చేయాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.రామచంద్రయ్య..

విశాలాంధ్ర - ప్యాపిలి : యురేనియం తవ్వకాల పేరిట పేద ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడితే సహించేది లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు పి.రామచంద్రయ్య, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె. రామాంజనేయులు అన్నారు. బుధవారం మండల పరిధిలోని జక్కసాని కుంట్లలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రాధాకృష్ణ అధ్యక్షతన జరిగిన బహిరంగసభలో వారు మాట్లాడుతూ యురేనియం తవ్వకాల కారణంగా ప్రజా జీవితం అస్తవ్యస్తం అవుతుందన్నారు. రాయలసీమలో ప్రజలు కరువు కాటకాలతో అల్లాడిపోతుంటే ఆదుకోవాల్సిన ప్రభుత్వం యురేనియం తవ్వకాలకు టెండర్లను పిలిచిందన్నారు. ఈ తవ్వకాల వల్ల పచ్చని పంట పొలాలు బీడు వారి పోతయన్నారు. రైతులు పంట పొలాల్లో పంటలు పండించుకుని ఈ పొలలే వారికి జీవనాధరం అని వారు అన్నారు. ప్రధాని మోడీ అమెరికా వంటి సంపన్న దేశాలతో చేతులు కలిపి యురేనియం తవ్వకాలకు ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. రైతులు వ్యవసాయం పైనే ఆధారపడి జీవనం చేస్తూ సకాలంలో వర్షాలు పడక నష్టాలకు గురై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తక్షణమే యురేనియం టెండర్లను రద్దు చేసి ప్రజలను రైతులను ఆదుకోవాలన్నారు. అనంతరం సీపీఐ నంద్యాల జిల్లా కార్యదర్శి రంగనాయుడు మాట్లాడుతూ నంద్యాల జిల్లా సరిహద్దు మండలం అయిన ప్యాపీలి కేవలం వర్షం మీదనే ఆధారడి రైతులు జీవిస్తున్నారని ఎన్ని ప్రభుత్వాలు, ఎంత మంది పాలకులు ఉన్నత స్థాయి పదవులు ఉన్నా ఇప్పటి వరకు చెరువులకు హంద్రీ నీవా ద్వారా నీరు నింపుతామని చెప్పడమే తప్ప ఆచరణలో లేదని ఆయన ఎద్దేవా చేశారు. దీని కోసం రైతులు ఎదురు చూపులు చూస్తుంటే హఠాత్తుగా యురేనియం టెండర్లు తవ్వకాలకు 5వేల కోట్లు కేటాయించడం పట్ల రాంపురం, జక్కసాని కుంట్ల, మమిల్ల పల్లి గ్రామాల ప్రజలను దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారని తెలిపారు. దీని వల్ల ప్యాపిలి, రాయల చేరువు,గుత్తి తదితర ప్రాంతాల్లోని కూడా తీవ్ర ప్రభావం ఉంటుందన్నారు. ప్రజలు రోగాల బారిన పడతారని తెలిపారు. కావున తక్షణమే కేంద్ర ప్రభుత్వం యురేనియం ప్రాజెక్టను రద్దు చేయాలని లేని పక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెనిన్ బాబు, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎస్.నబి రసూల్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫఖురుద్దీన్, సీపీఐ మండల సహాయ కార్యదర్శులు వెంకటేష్, పిక్కిలి వెంకటేష్, నాగన్న, సీపీఐ డోన్ మండల, పట్టణ కార్యదర్శి, సహాయ కార్యదర్శులు మోటా రాముడు, నారాయణ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నాగరాముడు,ఏఐటీయూసీ అధ్యక్ష, కార్యదర్శులు పుల్లయ్య, అబ్బాస్, ప్రజా నాట్య మండలి జిల్లా అధ్యక్ష కర్యదర్శులు శివయ్య,వాసు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సూర్య ప్రతప్, సీపీఐ సీనియర్ నాయకులు ధనుంజయ, అనంతపురం సీపీఐ సీనియర్ నాయకులు సూర్య నారాయణా రెడ్డి, సంజీవుడు, గ్రామాల నాయకులు రామకృష్ణ, పాల శ్రీనివాసులు, రాజు, మహేష్, భాస్కర్ రెడ్డి, మహిళలు, గ్రామాల నాయకులు, రైతులు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

అడవి బిడ్డలకు విద్య అందించండి

ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి..

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల జిల్లా నల్లమల పరిధి శ్రీశైలం, నందికొట్కూరు నియోజకవర్గాల్లో ఉన్న చెంచు గూడెంలలో గిరిజన చిన్నారులకు (అడవి బిడ్డలకు) ఏకలవ్య పాఠశాలలు ఏర్పాటు చేసి వారి చదువులను ప్రోత్సహించాలని కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి జ్యువల్ ఓరాంను నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కోరారు. ఢిల్లీలోని కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి కార్యాలయంలో కేంద్ర గిరిజన శాఖ మంత్రిని. కలిసిన సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏకలవ్య పాఠశాలలు గిరిజన ప్రాంతాల్లో ఉన్న పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడానికి ప్రవేశపెట్టారని, గిరిజన బిడ్డల విద్య, జీవన నైపుణ్యాల అభివృద్ధిపై ఏకలవ్య పాఠశాలలు దృష్టి సారిస్తాయన్నారు.

పేదలందరికీ ఇంటి స్థలాలు మంజూరు చేయాలి

విశాలాంధ్ర - అవుకు : అర్హులైన పేద ప్రజలందరికీ ఇంటి స్థలాలు మంజూరు చేయాలి అని అవుకు మండల ఏఐటీయూసీ నాయకులు నాగాంజనేయులు అన్నారు. బుధవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించి అనంతరము తహసిల్దార్‌కు వినతి పత్రాన్ని అందించారు.ఈ సందర్భంగా నాగాంజనేయులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వము ఏర్పాటు కాకమునుపు నారా చంద్రబాబు నాయుడు గ్రామాలలో మూడు సెంట్లు, పట్టణాలలో రెండు సెంట్లు ఇంటి స్థలాలను నివాసయోగ్యమైనవి గుర్తించి పేద ప్రజలకు అందిస్తామని ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని అన్నారు. పేద ప్రజల ఇళ్ల నిర్మాణానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే 2,50,000 ఏమాత్రం సరిపోవని ఇళ్ల నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు బండి వెంకటేశ్వర్లు, నమ్యా నాయక్, డీలర్ హుసేని, మధు, సోను, స్కావెంజర్లు కృపావతి, సుజాత, మనీ, కళావతి, చెన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ స్ఫూర్తి ప్రదాతలు ఆవిష్కరణ

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల పట్టణం చాంద్ బాడాలోని క్రాంతి రేఖ గ్రంథాలయంలో ప్రముఖ రచయిత, అనువాదకులు మండ పేట ముహమ్మద్ షరీఫ్ సేకరణ, కూర్పులో రూపుదిద్దుకున్న "ఉద్యమ స్ఫూర్తి ప్రదాతలు" తెలుగు పుస్తకాన్ని జమాఅతె ఇస్లామీ హింద్ నంద్యాల శాఖ అధ్యక్షులు అబ్దుల్ సమద్, జిల్లా బాధ్యులు జకరియా ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ దైవం ప్రసన్నత కోసం పరితపిస్తు తమ జీవితాలు అంకితం చేసిన రెండు తెలుగు రాష్ట్రాలకు చిందిన 27 మంది త్యాగధనుల సంక్షిప్త సమాచారంతో ముహమ్మద్ షరీఫ్ కూర్పు ప్రతి ఉద్యమకారుడికి స్ఫూర్తి అన్నారు. ఈ కార్యక్రమంలో ఖిద్మత్ బియంసిఅధ్యక్షులు యూనూస్ బాషా,ముహమ్మద్ ఫయాజ్, సయ్యద్ జమీలుద్దీన్, ముహమ్మద్ షఫీ తదితరులు పాల్గొన్నారు.

వరి రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

విశాలాంధ్ర-అవుకు : ప్రస్తుతం వర్షాల నేపథ్యంలో వరి రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి అని మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ హక్ అన్నారు. మంగళవారం అవుకు పట్టణంలోని రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని వ్యవసాయ అధికారి అబ్దుల్ హక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ వరి పంట కోత దశలో ఉన్నందున నీరు నిల్వ ఉండకుండా మురుగు నీటి కాల్వల ద్వారా నీటిని తీసివేయాలని అన్నారు. గాలులకు నేల వాలిన పైరును కట్టలుగా కట్టుకొనాలని అన్నారు. తద్వారా గింజలు నీటిలో తడవకుండా ఉంటాయని, తడిచిన వరి ధాన్యంపై ఐదు శాతం ఉప్పు ద్రావణం పిచికారి చేసుకోవడం ద్వారా గింజలు మొలక రాకుండా అరికట్టవచ్చని అన్నారు. పంటబీమా కొరకు రైతులు ఈనెల 15వ తేదీ లోగా ప్రీమియం చెల్లించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు రైతులు పాల్గొన్నారు.

సీఎమ్మార్ షాపింగ్ మాల్ ప్రారంభం

- 6న నంద్యాలలో ప్రారంభం
- ప్రపంచ స్థాయి షాపింగ్ అనుభూతి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల పట్టణంలో ఈనెల 6వ తేదీన శుక్రవారం సిఎంఆర్ షాపింగ్ మాల్ ను ప్రారంభిస్తున్నారు. ప్రపంచ స్థాయి షాపింగ్ మాల్ అనుభూతితో వస్త్రాలను కొనుగోలు చేయవచ్చని నిర్వాహకులు పిలుపునిచ్చారు. నంద్యాల పట్టణంలోని శ్రీనివాస్ నగర్‌లో ఆరవ తేదీన అట్టహాసంగా ప్రారంభిస్తున్నామని, ఇందులో మహిళలు కావలసిన చీరలు, చుడిదార్స్, గాగ్రాస్, ఉమెన్స్ వేర్, మెన్స్ వేర్, కిడ్స్, రెడీమేడ్ రకాలతో పాటు పలు రకాల బట్టలు అందుబాటులో ఉంటాయని వారు పేర్కొన్నారు. గత 40 సంవత్సరాలుగా అదే నాణ్యత అదే నమ్మకంతో సీఎంఆర్ షాపింగ్ మాల్ రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు అందుబాటు ధరలో నాణ్యమైన వస్త్రాలను అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

మండల వ్యాప్తంగా మోస్తారు వర్షం

విశాలాంధ్ర- కొలిమిగుండ్ల : మండలంలోని ఆయా గ్రామాల్లో తుఫాన్ ప్రభావంతో బుధవారం మోస్తరు వర్షం కురిసింది. మోస్తరు వర్షం పడడంతో కంది, వరి సాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే కంది పూత రాలిపోగా, కోతలకు సిద్ధంగా ఉన్న వరి పొలంలోనే పడిపోయే పరిస్థితి నెలకొంది. మరోవైపు శనగ సాగుచేసిన రైతులు మాత్రం మోస్తారు వర్షం పడడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. సెనగ పంట సాగు చేసినప్పటి నుండి వర్షం లేకపోవడంతో పంట ఎదుగు లేకుండా ఉన్నది. దీంతో మోస్తరు వర్షం పడటంతో పంటకు ప్రాణం పోసినట్లయింది.

పాల డైరీ ఎన్నికలు వాయిదా..

విశాలాంధ్ర - చాగలమర్రి : మండలంలోని చిన్నవంగలి గ్రామంలో పాల ఉత్పత్తి దారుల సహకార సంఘం ఎన్నికలు వాయిదా పడ్డాయి. గ్రామంలో బుధవారం ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ఉండగా ఇరు వర్గాల మధ్య ఉద్రిక్తత వాతావరణం నెలకొంటుందన్న నేపథ్యంలో ఆళ్లగడ్డ రూరల్ సిఐ కంబగిరి రాముడు,ఎస్ఐలు రమేష్ రెడ్డి,వెంకటేష్,లతో పాటు మరో 20 మంది పోలీస్ బలగాలు మొహరించాయి. కొన్ని అనివార్య కారణాల వల్ల ఎన్నికలు వాయిదా వేస్తున్నట్లు స్థానిక ఎన్నికల అధికారి చంద్ర తెలిపారు.ఎన్నికలు వాయిదా వేస్తున్నట్లు నోటీసు ను స్థానిక కేంద్రం వద్ద అంటించి వెను తిరిగారు

నేల ఆరోగ్యంపై పోటీ పరీక్షలు

విశాలాంధ్ర - వెలుగోడు : డిసెంబర్ 5 తేది ప్రపంచ నేల ఆరోగ్య దినోత్సవం సందర్భంగా వెలుగోడు గ్రామంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ నందు విద్యార్థులకు నేల ఆరోగ్యం పై క్విజ్ మరియు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నామని వ్యవసాయ అధికారి పవన్ కుమార్ తెలిపారు. ప్రపంచ నేల ఆరోగ్య దినోత్సవాన్ని ఏఓ పవన్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు ద్వారా నేల ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తామని ఏవో తెలిపారు. రైతులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రపంచ నేల దినోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా కోరారు.

రూ.30 వేలు ఆర్థిక సాయం అందజేత

విశాలాంధ్ర - బనగానపల్లె : ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు ,టీడీపీ నంద్యాల పార్లమెంటు వాణిజ్య విభాగ అధ్యక్షులు టంగుటూరి సీనయ్య ఆధ్వర్యంలో వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట రామరాజు ఆర్థిక సహకారంతో జోలపురం చెందిన లక్మికు రూ.10వేల రూపాయలు,బనగానపల్లె పట్టణం లోని ఈద్గా నగర్ కు చెందిన చాంద్బాషాకు రూ.10వేల రూపాయలు ,వడ్డే మాధవికు 10వేల రూపాయలు ముగ్గురుకు రూ.30,000 వారి ఆరోగ్య పరిస్థితి బాగా లేనందున వారికి ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా టంగుటూరి శీనయ్య మాట్లాడుతూ గతంలో కూడా వసుధ ఫౌండేషన్ తరపున విద్యార్థులకు పుస్తకాలు , ఉపకార వేతనాలు అలాగే కరోనా సమయంలో ఎనిమిది మందికి ఆర్థిక సహాయ సహకారాలు అందించడం జరిగిందని దీనికి సహకరించినటువంటి పెండేకంటి రమన్ కుమార్‌కి, మంతెన వెంకటరామరాజుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీచర్ నాగరాజు , తిరుమలయ్య, హర్ష తదితరులు పాల్గొన్నారు.

మినీ గోకులం షెడ్లను త్వరగా పూర్తి చేయండి

విశాలాంధ్ర - కోవెలకుంట్ల : గ్రామాలలో రైతులు నిర్మించుకుంటున్న మినీ గోకులం షెడ్లను త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని ఉపాధి ఉపాధి హామీ పథకం సిబ్బందికి ఏపీడి సాంబశివరావు సూచించారు. బుధవారం కోవెలకుంట్ల పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో వరప్రసాద్ రావు ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఏపీడి సాంబశివరావు మాట్లాడుతూ ప్రభుత్వము ప్రతిష్టాత్మక చేపట్టిన మినీ గోకులం షెడ్లను త్వరగా పూర్తిచేసుకునేలా సిబ్బంది చూడాలన్నారు. అలాగే జాబ్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి వంద రోజులు పని దినాలు కల్పించడంతోపాటు పండ్ల మొక్కలు పెంపకం కూడా ప్రత్యేక శ్రద్ధచూపేలా వారికి అవగాహన కల్పించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈసీ హరి కిషోర్, జిల్లా జేఏసీ వైస్ చైర్మన్ టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం..

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ఆళ్లగడ్డ పట్టణంలోని పుల్లారెడ్డి వీధికి చెందిన ఆదిలక్ష్మి, ఓబులేసుల కుమార్తె అయిన నందిని (13) బుధవారం చున్నీతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఒక ప్రైవేట్ స్కూల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థినిని తల్లి పరీక్షలకు వెళ్ళమని మందలించడంతో ఇంట్లో ఎవరు లేని సమయంలో చున్నితో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు గమనించి పాపను ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో నంద్యాల ప్రభుత్వాసుపత్రికి మెరుగైన చికిత్స కోసం తరలించారు.

మోటార్ సైకిల్ బోల్తా..వ్యక్తికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర - రుద్రవరం : మండలంలోని ముత్తలూరు మెట్ట సమీపంలో మోటార్ సైకిల్ అదుపుతప్పి కింద పడిన సంఘటనలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. బుధవారం గ్రామస్తుల వివరాల మేరకు తమిళనాడుకు చెందిన ధనపాల్ అనే వ్యక్తి ముత్తలూరు సమీపంలో వరి కోత మిషన్ డ్రైవర్ గా పనిచేస్తున్నాడన్నారు. మోటార్ సైకిల్ పై రైతుల పొలం దగ్గరికి వెళ్తుండగా మార్గమధ్యలో మోటర్ సైకిల్ అతుపుతప్పి కింద పడటంతో అతనికి గాయాలు అయ్యాయన్నారు. ఇది గమనించిన రైతులు అతన్ని 108 వాహనం ద్వారా చికిత్స నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారన్నారు.

పట్టణ సీఐగా రాము బాధ్యతలు

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్ : ఆత్మకూరు పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా రాము బాధ్యతలు స్వీకరించారు. నంద్యాలలో విఆర్‌లో ఉన్న రామును ఆత్మకూరు సీఐగా బదిలీ చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలు తమ వంతు సహకారం అందించాలన్నారు. బెల్టు షాపులు,పేకాట,నాటు సారా తయారీ రవాణా దొంగతనాలపై దృష్టి సారించి చర్యలు తీసుకుం టామని తెలిపారు.బాధ్యతలు స్వీకరించిన సిఐకి సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు.

పాఠశాల ప్రహరీ గోడ కూలి బాలిక మృతి

విశాలాంధ్ర - నందికొట్కూరు : నందికొట్కూరు మున్సిపాలిటీ పరిధిలో విద్యానగర్‌లోని హాస్టల్ సమీపంలో ఉన్న మండల పరిషత్ ఉర్దూ ప్రాథమిక పాఠశాల ప్రహరీ గోడ కూలీ బుధవారం బాలిక మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఉర్దూ పాఠశాలలో12 మంది విద్యార్థినీ విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. వీరికి ఓకే ఉపాధ్యాయురాలు విద్యా బోధన నిర్వహిస్తోంది.ఈ పాఠశాలకు ప్రహరీ గోడ 2011 సంవత్సరంలో నిర్మించారు. పాఠశాల నిర్మించిన ప్రాంతం నల్ల రేగడి భూమి కావడంతో ప్రహరీ గోడ పగుళ్లు ఏర్పడ్డాయి. అయితే పాఠశాల సాయంత్రం 4 గంటల సమయంలో విద్యార్థులను ఇంటికి వదలడంతో పాఠశాలలో పనిచేస్తున్న ఆయా గేటు వేసే క్రమంలో ఈ సంఘటన జరిగినట్లు తెలుస్తోంది. ఆయాతో పాటు ముగ్గురు విద్యార్థులు అక్కడే ఉండడంతో పగుళ్లు ఇచ్చిన ప్రహరీ గోడ ఒక్కసారిగా అకస్మాత్తుగా కుప్పకూలడంతో అక్కడే ఉన్న విద్యార్థినీ విద్యార్థులపై పడింది. ఈ ప్రమాదంలో రెండవ తరగతి చదువుతున్న ఆస్మామహిన్(8) అనే బాలిక అక్కడికక్కడే మృతి చెందింది. మిగిలిన ఇద్దరు విద్యార్థులకు స్వల్ప గాయాలు కావడంతో స్థానికులు హుటాహుటిన ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆదుకుంటాం : ఎమ్మెల్యే

విషయం తెలుసుకున్న నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య వెంటనే స్పందించి సంఘటన స్థలానికి చేరుకొని పాఠశాల పరిసరాలను పరిశీలించి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలును వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నందికొట్కూరు ప్రభుత్వ వైద్యశాల కు చేరుకొని చికిత్స పొందుతున్న విద్యార్థులను ఆయన పరిశీలించారు. విద్యార్థిని విద్యార్థులకు మెరుగైన వైద్య చికిత్సలు నిర్వహించాలని వైద్యాధికారులకు ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల ప్రహరీ గోడ కూలి బాలిక మృతి చెందడం బాధాకరం జరిగిన సంఘటనపై జిల్లా కలెక్టర్,ఆర్డీవో లకు సమాచారం అందించానన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారి కుటుంబాన్ని అన్ని విధాలు ఆదుకునేందుకు కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే తో పాటు మున్సిపల్ కమిషనర్ ఎస్. బేబీ, తహశీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో సుబ్రహ్మణ్య శర్మ, ఎంఈఓ సుభాన్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ మొల్ల రబ్బానీ, కౌన్సిలర్‌లు మొల్ల జాకీర్ హుస్సేన్, దేశెట్టి సుమలత టిడిపి నాయకులు మందడి రవీంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి మృతిపై సమగ్ర విచారణ జరిపించాలి : సీపీఐ

విశాలాంధ్ర - జూపాడుబంగ్లా : నందికొట్కూరు పట్టణంలో ఉర్దూ పాఠశాల గోడ కూలీ విద్యార్థిని రెండవ తరగతి చదువుతున్న ఆస్తా మహిన్ మృతి చెందడం చాలా బాధాకరం అని సిపిఐ జిల్లా నాయకులు రమేష్ బాబు తెలిపారు.విద్యార్థి మృతి పై సమగ్ర విచారణ జరిపించాలి అని,బాధ్యులైన వారిని తక్షణమే అరెస్టు చేయాల న్నారు. గత వైసిపి ప్రభుత్వంలో వేల కోట్లు నిధులు నాడు నేడు కింద ఖర్చు చేసిన కూడా ఈ పరిస్థితి దాపురించిందంటే దాని వెనుక గల బాధ్యులను గుర్తించి తక్షణమే వారిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని డిమాండ్ చేశారు. విద్యార్థిని కుటుంబాన్ని ఆదుకొని 50 లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేసీయో చెల్లించా లని సీపీఐ జిల్లా నాయకులు ఎం.రమేష్ బాబు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు.

ఒప్పంద కార్మికులకు పెండింగ్ జీతాలు ఇప్పించాలి : ఏఐటీయూసీ

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో అనేక సంవత్సరాలుగా ఒప్పంద పద్ధతిలో పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న జీతాలు ఇప్పించాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. బుధవారం ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండ్‌కు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప,నగర కార్యదర్శి జి. చంద్రశేఖర్,ఉప ప్రధాన కార్యదర్శి టి.రామాంజనేయులుతో కలసి వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ మునెప్ప మాట్లాడుతూ కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో ఒప్పంద సెక్యూరిటీ, శానిటేషన్,పేస్ట్ కంట్రోల్ కార్మికులకు కాంట్రాక్టర్లు గత మూడు నెలలుగా జీతాలు చెల్లించలేదు. అందువలన కార్మికుల వాళ్ళ కుటుంబాలను పోషించుకోవడానికి పిల్లల చదువులో ఫీజుల కొరకు, ఇంటి అద్దెల కొరకు అనేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. తక్షణమే పెండింగ్ జీతాలు కార్మికులకు ఇప్పించేందుకు సదరు కాంట్రాక్టర్‌తో మాట్లాడి సూపరింటెండెంట్‌లు కృషి చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల జీతాలు గురించి కాంట్రాక్టర్‌ని అడిగితే నేరుగా డీఎంఈ విజయవాడ ఆఫీస్ నుండి బిల్లులు చెల్లించాల్సి ఉందన్నారు. ఇప్పటివరకు పెం డింగ్ బిల్లులు ఎక్కువగా ఉన్నాయని, పెండింగ్ బిల్లులు ఇప్పిస్తే జీతాలు ఇస్తామని కాంట్రాక్టర్లు వాదిస్తున్నారన్నారు, పెండింగ్ జీతాలు చెల్లించకపోతే కార్మికులతో కలసి ఆందోళన చేస్తామని తెలిపారు.

జరిగిన అవినీతిపై సమగ్ర విచారణ జరిపించాలి

విశాలాంధ్ర - కర్నూలు వైద్యశాల: క్యాన్సర్ హాస్పిటల్ నిర్మాణంలో జరిగిన అవినీతిపై సమగ్ర విచారణ జరిపించాలి ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, నగర కార్యదర్శి బీసన్నలు డిమాండ్ చేశారు. బుధవారం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో పూర్తిస్థాయిలో క్యాన్సర్ పేషెంట్లకు వైద్య సేవలందించే విధంగా చర్యలు తీసుకోవాలని స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏఐవైఎఫ్ నగర అధ్యక్షులు బాబయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాటాడుతూ పాలకులు, ప్రభుత్వ అధికారులు బదిలీ నేపథ్యంలో క్యాన్సర్ హాస్పటల్లో పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం జరుగుతుందన్నారు. 2019 జనవరి నెలలో శంకుస్థాపన చేస్తే 2024 సంవత్సరం పూర్తి కావస్తున్నా ఇప్పటివరకు పూర్తి స్థాయిలో వైద్య సౌకర్యాలు పూర్తి స్థాయిలో లేవన్నారు. 2024 మార్చి 7న అప్పటి వైసీపీ ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, ఆర్థిక శాఖ మంత్రి స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్ ప్రారంభించారన్నారు. కోట్ల రూపాయల విలువైన వైద్య పరికరాలు వచ్చినప్పటికీ వాటిని ఉపయో గించడం లేదన్నారు.ఎలక్ట్రిసిటీకి సంబం ధించిన పాత బిల్లులు పెట్టుకొని కొంతమంది అధికారు లు దాదాపు రూ.50 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు క్యాన్సర్ హాస్పిటల్ నిధులను స్వాహా చేశారనే ఆరోప ణలు ఉన్నాయన్నారు. వీటన్నిటిపై జిల్లా కలెక్టర్ స్థానిక ఎమ్మెల్యే మంత్రి టీజీ భరత్ స్పందించి అవినీతికి పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవడమే కాకుం డా క్యాన్సర్ హాస్పటల్లో మౌలిక వసతులు కల్పించి క్యాన్సర్ పేషంట్లకి మెరుగైన వైద్య సౌకర్యాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమన్న, నగర కార్యదర్శి అశోక్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు చంటి, నగర ఆర్గనైజింగ్ కార్యదర్శి కృష్ణ, నగర నాయకులు ఎం.శ్రీనివాసులు, నాగరాజు, కుమార్, రాజ్ కుమార్, శివాజీ, షాహిద్ బాష, నరేష్, నబి, మహమ్మద్ రఫీ, చంద్రశేఖర్, సుధాకర్ పాల్గొన్నారు.

నష్టపోయిన మిరప రైతులను ఆదుకోవాలి

ఆకుముడత తెలుగుతో తీవ్ర నష్టం

మిరపకు గిట్టుబాటు ధర కల్పించాలి

విశాలాంధ్ర- గోనెగండ్ల: మిరప పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని మిరప రైతులు కోరుతున్నారు. మండల కేంద్రంలో మిరప రైతు చాకలి చిన్న శంకరన్న తనకు రెండెకరాల పొలంలో మిరప పంట సాగు చేశాడు. మిరప పంటకు పెట్టుబడి దాదాపు రూ.2 లక్షల ఖర్చు అయ్యింది. పంట చేతికి వచ్చే సమయంలో ఆకుముడత తెలుగుల్లు వైరస్ వచ్చి పంటంతా ఎండిపోతోంది. తెలుగును నివారించేందుకు సుమారు 20 సార్లకుపైగా పిచికారి మందు కొట్టాడు. అయినా తెగులు నివారించబడలేదు. కనీసం వచ్చిన పంటకు గిట్టుబాటు ధర కూడా లేదు. మార్కెట్‌లో రూ.6 వేల నుంచి రూ.8వేల వరకు పలుకుతుంది. వైరస్ సోకడం వల్ల వంట దిగుబడి తగ్గుతుంది. ఇలాగే మండలంలో చాలా మంది రైతులు మిరప పంట సాగు చేశారు. కనీసం పెట్టిన పెట్టుబడి వస్తుందా లేదా అని భయంతో మిరప రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మిరప రైతులను ఆదుకోని, పంటభీమా, నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి- రైతు చాకలి చిన్న శంకరన్న: నేను 2 ఎకరాలు మిరప పంట సాగు చేశాను. పెట్టుబడి రూ.2 లక్షలు అయ్యింది. వైరస్ వల్ల పంట బాగా నష్టపోయాను. గిట్టుబాటు ధర లేక నేను అప్పుల పాలు అయ్యాను. నాలాంటి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

రెండు సెంట్లు స్థలం ఇవ్వాలి : సీపీఐ

విశాలాంధ్ర - కర్నూలు : నగరంలో సొంత ఇంటి స్థలం లేని పేదలకు రెండుసెంట్ల స్థలం ఇవ్వాలని సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి కోరారు. బుధవారం సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో జిల్లా పరిషత్‌లో ఉన్న తహశీల్దార్ అర్బన్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమానికి నగర పార్టీ కార్యవర్గ సభ్యులు అన్వర్ బాష అధ్యక్షత వహించారు. ఈ ధర్నా కార్యక్రమాన్ని ఉద్దేశించి నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ కర్నూలు నగరంలోని ఇంటి స్థలం లేని నిరుపేదలు వేలాదిమంది ఉన్నారన్నారు. అందులో ప్రధానంగా వన్ టౌన్ ఏరియాలోని చిన్న మార్కెట్, పెద్ద మార్కెట్, గనిగల్లి, గడ్డ కుమ్మరి వీధి, జమ్మి చెట్టు ఏరియా, పూల బజారు, చిన్న అమ్మవారి శాల, పెద్దపుడకన, చిన్న పడకన ఏరియాలోని ముస్లిం మైనార్టీ సోదరులు వేలాదిమంది ఇంటి స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కుటుంబాలు పెరిగి పెద్దయి ఒకటే ఇంట్లో 10నుండి 12 మంది ఉంటున్నారని తెలిపారు. అలాంటి వారిని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి వారికి రెండు సెంట్లు స్థలం మంజూరు చేయాలని అదే స్థలంలో ఇంటి నిర్మాణం చేసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ఐదు లక్షల రూపాయలు మంజూరు చేసి ఇసుక, సిమెంటు, స్టీలు ప్రభుత్వమే ఫ్రీగా సరఫరా చేయాలన్నారు. అనంతరం ఎమ్మార్వో వెంకటలక్ష్మికి వినతిపత్రం అ ందచేశారు. ధర్నా చేస్తున్న వారి దగ్గరికి వచ్చి ప్రజలు తీసుకొచ్చిన వ్యక్తిగత అర్జీలను స్వీకరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వన్ టౌన్ ఏరియా మహిళా సమైక్య నాయకులు దేవి భాయ్ ,అనురాధ భాయ్, జై బున్ బీ, మల్లికా బి.ముంతాజ్ బీ, రమీజాబీ, ఆశాబీ, రాజేష్, యువజన సమాఖ్య నగర అధ్యక్షులు బాబయ్య, మౌలాలి, రసూల్, సయ్యద్ బాష,శివ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేయాలి : జిల్లా ఎస్పీ

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : మహిళల భద్రత, రక్షణకు, బాల్య దశను ఉన్నతంగా తీర్చిదిద్దే విధంగా అన్ని శాఖలు కలిసి సమన్వయంతో పని చేయాలని జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ అన్నారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో కర్నూలులోని చైల్డ్ వేల్ఫేర్ కమిటి, డిస్ట్రిక్ చైల్డ్ ప్రోటెక్షన్ యూనిట్, ఐసిడిఎస్, విద్యా శాఖ, లేబర్ డిపార్ట్మెంట్, అంగన్ వాడీ టీచర్స్, అంగన్ వాడీ వర్కర్క్ కస్తూర్బగాంధీ విద్యాలయ శాఖల సిబ్బందితో జిల్లా ఎస్పీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు, సలహాలు చేశారు. అనంతరం లైంగిక నేరాల నుంచి పిల్లలకు రక్షణ కల్పించాలనే కరపత్రాలను జిల్లా ఎస్పీ ఆవిష్కరించారు. చైల్డ్ వేల్ఫేర్ కమిటి చైర్ పర్సన్ ఎస్.జుబేధ బేగం, డీఈఓ శ్యాముల్ పాల్, బాలల సంరక్షణ అధికారి శారద, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ డిపార్ట్‌మెంట్ అధికారి నీలకంతేశ్వర్, సీఐలు ప్రసాద్ ఉన్నారు.

దేశ ప్రజల గుండెచప్పుడు రాజ్యాంగం

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు: సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర విశిష్ట లక్షణాలు కలిగి స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి హక్కులు కల్పించి భారత రాజ్యాంగం దేశ ప్రజలలో గుండెచప్పుడు అయిందని ఎమ్మిగనూరు మండల తహాశీల్దారు ఎ.శేషఫణి, దళిత రచయితల సంఘం గౌరవాధ్యక్షులు కదిరికోట ఆదెన్నలు అన్నారు. బుధ వారం దళిత రచయితల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు, ఉపాధ్యాయులు ఆరెకంటి భాస్కర్ ఆధ్వర్యంలో 75 వ భారత రాజ్యాంగ దినోత్సవం వజ్రోత్సవాల పోస్టర్లను మండల తహాశీల్దార్ శేషఫణి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దళిత రచయిత సంఘం ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యాయులు పి.మాదన్న, ఉపాధ్యక్షులు, లెక్చరర్ పి.రంగస్వామి, రచయిత కొమ్మినేని భోజరాజు, బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ నాయకులు పూల చింత ఈరేష్ తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి సరఫరాకు చర్యలు తీసుకుంటాం

విశాలాంధ్ర - హొళగుంద: మండలంలోని మార్ల మడకి ప్రజలకు మంచినీటి సరఫరాకు చర్యలు తీసుకుంటామని సర్పంచ్ ఎంకప్ప బుధవారం తెలి పారు. గ్రామంలో మంచినీటి పైపులైన్లు పగిలి నీరు వృధా అయిందని పైప్ లైన్ లీకేజ్ అరికట్టడానికి చర్యలు తీసుకున్నామని అన్నారు. పైప్ లైన్ పగిలిన చోట కొత్త పైపులు అమర్చి మరమ్మతుచేశామని అన్నారు. అలాగే హెలగుండ గ్రామంలో వేసిన మంచి నీటి బోరు ద్వారా రోజు ప్రజలకు మంచినీటి సరఫరా చేస్తున్నామని అయితే అయితే ప్రజలకు త్రాగునీరు అందించడానికి కొత్త పైపులు అమర్చి నిరంతరంగా మంచినీటి సరఫరా చేస్తామన్నారు. సర్పంచ్ వెంట గ్రామ కార్యదర్శి రాజ్ కుమార్, వైసీపీ నాయకుడు రమేష్ పాల్గొన్నారు.

రహదారి నిర్మాణం చేపట్టాలి

విశాలాంధ్ర - కర్నూలు సిటీ: నగరంలోని సంతోష్ నగర్ డి.మోసెజ్ నగర్ నందు రహదారి అధ్వాన్నంగా ఉందని, సీసీ రోడ్డు నిర్మించాలని అక్కడి స్థానికులు నగరపాలక సంస్థ కార్యాలయ మేనేజర్ ఎస్.చిన్నరాముడును కోరారు. ఈ మేరకు బుధవారం నగరపాలక కార్యాలయంలో స్థానికులు మేనేజర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో రియాజ్, మహబూబ్‌బి, సుశీల, ధీరజ్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష విభాగాలను పరిశీలించిన వైస్ ఛాన్సలర్

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్ : రాయలసీమ విశ్వ విద్యాలయానికి అనుబంధంగా ఉన్న కళాశాలల్లో బుధవారం జరిగిన 5వ సెమిస్టర్ డిగ్రీ పరీక్షలను వర్సిటీ వైఛాన్సలర్ ఆచార్య ఎన్టీకే నాయక్ పరిశీలించారు. కర్నూలులోని శ్రీసాయికృష్ణ డిగ్రీ కాలేజీలో పరీక్షలు జరుగుతున్న విధానాన్ని ఆయన వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లుతో కలిసి పరిశీలించారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లు లేకుండా చూసుకోవాలని సూచించారు.

గ్రామాభివృద్ధే లక్ష్యం : సర్పంచ్

విశాలాంధ్ర - పెద్దకడబూరు : గ్రామాభివృద్ధే తన లక్ష్యమని దొడ్డి మేకల గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని దొడ్డిమేకల గ్రామంలో సర్పంచ్ చంద్రశేఖర్ పారిశుధ్య పనులు, డ్రైనేజీలలో పూడిక తీయించారు. అలాగే ఈర్లపాటి ఆంజనేయ స్వామికి వెళ్లే రహదారిలో రైతులు పొలాలకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులకు పడుతున్నారని గ్రహించిన సర్పంచ్ మోరి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి సమస్య, డ్రైనేజీ సమస్య తదితర ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొని రావాలని కోరారు. గ్రామంలో ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు చర్యలు తగిన చర్యలు తీసుకుంటానని తెలిపారు.

ఇళ్ల నిర్మాణాల బిల్లులపై తనిఖీ

విశాలాంధ్ర - సి.బెళగల్: మండల కేంద్రంలో ఇళ్లను నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు ఇప్పటి వరకు అందిన బిల్లులపై డీఆర్పీ విల్సన్ బుధవారం తనిఖీ చేశారు. సామాజిక తనిఖీలో భాగంగా బెళగల్‌లో 28 ఇళ్లకు బిల్లులు అందినట్లు ఆయన తెలిపారు. ఇప్పటివరకు ఇళ్ల నిర్మాణాల్లో లబ్ధిదారులకు అందిన బిల్లులలోఅక్రమాలు ఉన్నాయా లేదా అని పరిశీలన చేసి ఎలాంటి అవకతవకలు లేవని అన్నారు. జాతీయ ఉపాధి హామీ పని పథకంలో భాగంగా చేపట్టిన పూడికతీత పనులను పరిశీలించి, ప్రతి ఒక్కరూ ఉపాధి పనులను సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాన్ని విజయవంతంగా నిర్వహించాలి

విశాలాంధ్ర బ్యూరో- కర్నూలు : డిసెంబరు 7వ తేదీన జరిగే మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాన్ని ఎలాంటి లోటుపాట్లు లేకుండా విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష విద్యా శాఖాధికారులను ఆదేశించారు.బుధవారం మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం ఏర్పాట్లపై ఆర్డీఓలు, మున్సిపల్ కమీషనర్లు, ఎంఈఓలతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ డిసెంబరు 7వ తేదీన జరిగే మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశానికి రాష్ట్ర ప్రభుత్వం చాలా ప్రాధాన్యత నిస్తోందని, అందువల్ల ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

టీడీపీ సభ్యత్వం ఓ వరం..

విశాలాంధ్ర - ఆదోని రూరల్: టీడీపీ సభ్యత్వం తీసుకున్న ప్రతి కార్యకర్తకు ఓ వరం లాంటిదని టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ సూరం భాస్కర్ రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని సాంబగల్ గ్రామంలో సూరం భాస్కర్ రెడ్డి నేతృత్వంలో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఎంతో ప్రశాంతంగా నిర్వహించారు. టీడీపీ సానుభూతిపరులు, కార్యకర్తలు టీడీపీ సభ్యత్వానికి రూ.100లు చెల్లించి నమోదు చేసుకున్నట్లయితే రూ.5 లక్షలు బీమా పొందడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎంతగానో మేలు చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు బాసరకోడు సోమశేఖర్ రెడ్డి, ఫక్రుద్దీన్, మాజీ కౌన్సిలర్ రామచంద్ర, బుద్ధారెడ్డి, గోపాల్ రెడ్డి, నెట్టికల్లు, ఈరన్న, సాదీరాపుఫ్ తదితరులు ఉన్నారు.

రైతు సమస్యలను పరిష్కరించేందుకే సదస్సులు

విశాలాంధ్ర - క్రిష్ణగిరి: గ్రామాల్లో రైతుల సమస్యలను పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ దేవ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో పాత్రికేయులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు డిసెంబర్ 6 నుంచి జనవరి 3 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈనెల 6న అమకతాడు, 7న మన్నెకుంట, 10న చిట్యాల, 11న ఎరుకల చెరువు 12న క్రిష్ణగిరి, 13న లక్కసారం, 17న కటారు కొండ, 18న చుంచుఎర్రగుడి, 19న కంబాలపాడు, 20న ఆలంకొండ, 21న తొగర్చేడు, 27న పోతుగల్లు, 28న ఆగవేలి, జనవరి 2న గోకులపాడు, 3న స్తోత్రం ఎర్రగుడి అన్ని రెవెన్యూ గ్రామాలలో సదస్సులను నిర్వహిస్తామన్నారు. రైతులు భూ సంబంధమైన సమస్యలు ఏవైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన తెలిపారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు: ఈ నెల 5వ తేదీన కర్నూలులో జరిగే డీహెచ్‌పీఎస్ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి మహేష్ పిలుపునిచ్చారు. ఎమ్మిగనూరు సీపీఐ కార్యాలయంలో దళిత హక్కుల పోరాట సమితి ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి సి.మహేష్, సీపీఐ పట్టణ కార్యదర్శి జి.రంగన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళిత, గిరిజన సబ్ ప్లాన్ పేరుతో దళితులకు 6.28 శాతం, గిరిజనులకు 2.56 శాతం మాత్రమే కేటాయించారని వారన్నారు. 25 శాతం నిధులు కేటాయించాలి కానీ 9 శాతం నిధులు మాత్రమే కేటాయించారని వారన్నారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రతిష్టించినటువంటి రాజదండం స్థానంలో రాజ్యాంగాన్ని ఏర్పాటు చేయాలని వారు కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దళితులు గిరిజనుల చిన్నచూపు చూస్తుందని ఆ వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు రాజీవ్, దళిత కుల పోరాట సమితి నాయకులు పెద్దయ్య, మల్లికార్జున,రాజు,విజయ్, ఈరన్న, వీరేంద్ర, మధు, హరి, రామాంజనేయులు, భీమా, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ అచ్చీవ్‌మెంట్ సర్వే పరీక్ష

విశాలాంధ్ర - పెద్దకడబూరు: మండల కేంద్రమైన పెద్దకడబూరులోని ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నౌలేకల్ లోని ప్రాథమికోన్నత పాఠశాలలోని విద్యార్థులకు బుధవారం నేషనల్ అచీవ్ మెంట్ సర్వే పరీక్ష నిర్వహించడం జరిగిందని మండల విద్యాధికారి-2 రామ్మూర్తి తెలిపారు. పెద్దకడబూరు ప్రాథమిక పాఠశాల నందు 3వ తరగతిలో 26 మంది విద్యార్థులకు, నౌలేకల్ ప్రాథమికోన్నత పాఠశాల నందు 3వ తరగతిలో 24 మంది విద్యార్థులకు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతిలో 30 మంది విద్యార్థులకు పరీక్ష నిర్వహించడం జరిగిందన్నారు. ఈ పరీక్షను విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను అంచనా వేయడానికి, అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరచడానికి, గుణాత్మక విద్యను అందించడానికి ఉపయోగపడుతుందని ఆయన వెల్లడించారు.

జాతీయ స్థాయి హాకీ పోటీలకు విద్యార్థి ఎంపిక

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్ : ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి హాకీ పోటీలు అనకాపల్లి జిల్లా నక్క పల్లిలో గత నెల 14 ఏళ్లలోపు విద్యార్థులకు జరిగాయి. ఈ హాకి పోటీల్లో గార్గేయపుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఫర్హాణ జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రదానోపాధ్యాయుడు వెంకట్రావుకు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు పాఠశాలలో జరిగిన అభినందన సభలో ప్రధానోపాధ్యాయుడు, రాయలసీమ యునివర్సిటీ విద్యార్థి సంఘం నాయకుడు రెడ్డీపోగు ప్రశంత్ జాతీయ క్రీడాకారిణి ఫర్హాణాను అభినందించారు. మధ్య ప్రదేశ్‌లో మదార్సాలలో ఈ నెల 9వ తేది నుండి 12వ తేది వరకు జరుగు పోటీల్లో ఫర్హాణా పాల్గొంటుందని తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు, ఫిజికల్ డైరెక్టర్ వేంకటేశ్వర్లు విద్యార్థి ఫర్హాన ను అభినందించారు.

సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టండి : సీపీఐ

విశాలాంధ్ర - కోడుమూరు: సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని సీపీఐ నాయకులు బి.రాజు కోరారు. బుధవారం పట్టణంలోని స్థానిక రామన్ పబ్లిక్ హైస్కూల్ వెనుక ప్రాంతంలో ఉన్న రిటైర్డ్ హెడ్మాస్టర్ రాఘవరెడ్డి ఇంటి వద్ద నుంచి పడమటి దిక్కుగా ఉన్న రస్తా తోపాటు దక్షిణ దిశ వైపుగా ఉన్న నారాయణ ఆచారి ఇంటి వరకు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని వార్డు సభ్యురాలు బి.రాజేశ్వరి భర్త సీపీఐ నాయకులు బి.రాజు కాలనీవాసులతో కలిసి గ్రామ పంచాయతీ పాలకవర్గాన్ని కోరారు. ఈ మేరకు సీపీఐ నాయకులు రాజు కాలనీలో నివసిస్తున్న ప్రజలతో కలిసి బుధవారం స్థానిక గ్రామపంచాయతీ కార్యా లయంలో కార్యనిర్వహణ అధికారి కె.అజయ్ భాస్కర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బి.రాజు మాట్లాడుతూ గత ఎన్నో ఏళ్లుగా కాలనీలో సీసీ రోడ్డు లేక కాలనీ ప్రజలందరూ తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వర్షాకాలంలో చిన్న పిల్లలు, వృద్ధులు ఈ రస్తాలో నడిచేందుకు నానా అవస్థలు పడాల్సి వస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రజలు జంగం వీరయ్య స్వామి, ఎస్ జి నాగేష్, శేఖర్ ఆచారి, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర - సి.బెళగల్: ఈ నెల 6వ తేదీ నుండి మండలంలో జరిగే రెవిన్యూ సదస్సులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాస రెడ్డి రైతులకు సూచించారు. బుధవారం తేదీల వారీగా ప్రకటన విడుదల చేసి మాట్లాడుతూ రెవెన్యూ సదస్సు 6న బెళగల్-1, 11న కొత్త కోట, 13న గుండ్రేవుల, 18న తిమ్మం దొడ్డి, 20న బురాన్ దొడ్డి గ్రామాల్లో తహశీల్దార్, 10న బ్రాహ్మణ దొడ్డి, 12 న కొండాపురం, 17న పలుకుదొడ్డి, 19న కంభదహాల్, 21న బెళగల్ -2 డిప్యూటీ తహశీల్దార్ పురుషోత్తం ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించటం జరుగుతాయని తెలిపారు.

అధైర్య పడొద్దు - అండగా ఉంటాం

విశాలాంధ్ర - పెద్దకడబూరు : పెద్దకడుబూరు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నేత బాపురం హనుమంతరెడ్డి తనయుడు, టీడీపీ నాయకులు వీరసేనారెడ్డి (53) అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న టీడీపీ జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరెడ్డి వీరసేనారెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. అధైర్య పడొద్దని అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మంత్రాలయం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ రాఘవేంద్రరెడ్డి సోదరులు టీడీపీ యువనేత రామకృష్ణారెడ్డి, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు ప్రదీప్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తం రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి మృతుడు వీరసేనారెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మధుసూదన్ రెడ్డి, ఏసేపు, మల్లికార్జున, దశరథ రాముడు, మీసేవ ఆంజనేయులు, బొగ్గుల తిక్కన్న, వైసీపీ నాయకులు పూజారి ఈరన్న, రామలింగారెడ్డి, ముక్కరన్న, అర్లప్ప తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాన్ని మరోచోటికి మార్చండి

విశాలాంధ్ర - కోడుమూరు : పట్టణంలోని ఆదోని రోడ్డు నందు ప్రభుత్వ బాలికల కళాశాల హాస్టల్ దగ్గర వున్న మల్లికార్జున వైన్స్ మద్యం దుకాణాన్ని మరొక చోటికి మార్చాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రంగస్వామి కోరారు. ఈ మేరకు బుధవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కోడుమూరు ఎక్సైజ్ సీఐ మంజులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బి.రంగస్వామి మాట్లాడుతూ ప్రభుత్వ బాలికల కళాశాల హాస్టల్ సమీపంలో వైన్ షాప్ ఉండడం వల్ల విద్యార్థులకు తీవ్ర ఇబ్బందిగా ఉందన్నారు. మద్యం తాగి కొందరు ఆకతాయిలు విద్యార్థినిలపట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయని తెలిపారు. హాస్టల్ పరిసర ప్రాంతాల్లో మద్యం బాబులు అక్కడే మద్యం తాగడంతో విద్యార్థినిలు బయటికి రావాలంటే భయం భయంగా రావాల్సి వస్తుందన్నారు. బాలికల హాస్టల్ దగ్గర్లో ఉందన్న విషయాన్ని పరిగణలోకి తీసుకొని మలికార్జున వైన్ షాపును వేరేక చోటుకి మార్చాలని కోరారు.లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థినీయులందరిని సమీకరించి పెద్దఎత్తున ధర్నాలు, రాస్తారోకో నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ కోడుమూరు మండల కార్యదర్శి అల్తాఫ్ బాష, మండల ఉపాధ్యక్షులు వీరాంజనేయులు, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

అపర చాణక్యుడు కొణిజేటి రోశయ్య

విశాలాంధ్ర - జిల్లా పరిషత్ కర్నూలు: అపర చాణక్యుడు కొణి జేటి రోశయ్య అని మాజీ ఎమ్మెల్సీ, డీసీసీ మాజీ అధ్యక్షులు ఎం.సుధా కర్ బాబు అభిప్రాయ పడ్డారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన మాజీ ముఖ్యమంత్రి, మాజీ గవర్నర్ స్వర్గీయ కొణిజేటి రోశయ్య మూడో వర్థంతి సందర్భంగా పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సుధాకర్ బాబు మాట్లాడుతూ రోశయ్య 1933 జూలై 4న జన్మించారని, అంచెలంచెలుగా ఎదిగి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీగా, రాష్ట్ర మంత్రిగా, కాంగ్రెస్ ప్రభుత్వాలలో కీలకమైన ఆర్థిక శాఖ మంత్రిగా 15 సార్లు బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ నాయకులు కె.వెంకటరెడ్డి, ఐఎన్టీయూసీ అధ్యక్షులు బి.బతుకన్న, ప్రధాన కార్యదర్శి ఎన్.సుంకన్న, షేక్ ఖాజా హుస్సేన్, ఎస్.ప్రమీళ, కె.సత్యనారాయణ గుప్త, కురువ నాగశేషు, బి.రామాంజనేయులు పాల్గొన్నారు.

జాతీయ మహాసభలకు తరలివెళ్లిన మహిళా నేతలు

విశాలాంధ్ర - కర్నూలు : ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జాతీయ 22వ మహాసభలు భారత రాజధాని నగరమైన ఢిల్లీలో డిసెంబర్ 6 7 8 వ తేదీల్లో జరుగుతున్న మహా సభలకు కర్నూలు జిల్లా మహిళా సమాఖ్య నాయకురాళ్లు శ్రావణి రెడ్డి, గిడ్డమ్మ పావని, రంజిత తరలి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళాభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా, స్వేచ్ఛ సమానత్వం సాధికారతలను కాంక్షిస్తూ మహిళా సమస్యల పరిష్కారం కోసం ఏడు దశాబ్దాలకు పైగా పలు రూపాల్లో ఉద్యమిస్తూ, ఫలితాలు సాధిస్తూ, ప్రజల మన్ననలు పొందుతున్న ఎన్ఎఫ్ఐడబ్ల్యూ అని వారు అన్నారు. 1954 జూన్‌లో కలకత్తాలో ఏర్పాటు చేయబడి నాటినుండి నేటి వరకు స్త్రీ పురుష వివక్షతకు తావులేని, కుటుంబ, సాంఘిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, సమానత్వం కోసం, శాంతి పరిరక్షణ కోసం, భారతదేశ సమగ్రత, సమాఖ్యత, లౌకిక ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం, మతసామరస్యతను కాపాడడం కోసం, మహిళా సమస్యల పరిష్కారానికి జరిగిన అనేక పోరాటాలకు ఉద్యమాలకు సారథం వహిస్తుందని తెలిపారు. దేశంలో, రాష్ట్రంలో మహిళలు ఎదుర్కొంటున్న కుటుంబ, సాంఘిక,ఆర్థిక,రాజకీయ సమస్యలతోపాటు మహిళలపై ప్రపంచీకరణ ప్రభావం దేశ అభివృద్ధిలో మహిళల పాత్ర అధిక ధరలు, అత్యాచారాలు తదితర అంశాలపై చర్చలు జరిపి తీర్మానాలు చేసి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని వారు తెలిపారు. అనంతరం కర్నూలు రైల్వే స్టేషన్ నందు మహిళా సమాఖ్య నాయకురాళ్లు భారతి, రేణుక, నాగేశ్వరమ్మ, సోఫియా, సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి, సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు, నగర కార్యవర్గ సభ్యులు అన్వర్, నాగరాజు, కుమార్, శివ రాముడు, సయ్యద్ బాష, రసూలు, మౌలాలి తదితరులు వీడ్కోలు పలికారు.

ఆకస్మికంగా సచివాలయాలు తనిఖీ

విశాలాంధ్ర - నందవరం : టి.సోమాల గూడూరు, పోనకలదిన్నె గ్రామాల్లోని సచివాలయాలను ఎమ్పీడీవో పుల్లయ్య, హౌసింగ్ డీఈ ప్రసాద్, ఈవోపీఆర్డీ సందీప్‌లు ఆకస్మికంగా బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న సచివాలయాల్లో సిబ్బంది సమయపాలన పాటించాలని, లేదంటే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో శ్రీనివాసులు, నాగలదిన్నె గ్రామ సర్పంచ్ భర్త తిమ్మప్ప, పంచాయతీ కార్యదర్శి నౌసన్న, ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో..

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandra.com
కర్నూలు, గురువారం 05, డిసెంబర్ 2024

రేపటి నుండి వచ్చే నెల 8 వరకు రెవెన్యూ సదస్సులు

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : డిసెంబరు 6వ తేదీ నుండి జనవరి 8వ తేదీ వరకు నిర్వహించే రెవెన్యూ సదస్సులను విజయవంతంగా నిర్వహించి భూ సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంప్స్ శాఖామంత్రి అనగాని సత్యప్రసాద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. బుధవారం విజయవాడ నుండి రెవెన్యూ సదస్సుల నిర్వహణపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భూ సమస్యలను సత్వరమే పరిష్కరించేలా ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు డిసెంబరు 6వ తేది నుండి జనవరి 8వ తేది రెవెన్యూ సదస్సులు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు.ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సుల నిర్వహణకు ఈనెల 5వతేదీ లోగా షెడ్యూల్ ఖరారు చేసే విధంగా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెద్ద రెవెన్యూ గ్రామాల్లో రోజంతా చిన్న రెవెన్యూ గ్రామాలకు ఒకపూటలో రెవెన్యూ

సదస్సుల నిర్వహణకు తగినంత కూర్చోగలిగే సామర్థ్యం ఉన్న సరైన ప్రదేశాలను ఎంపిక చేసుకోవాలని చెప్పారు. భూ సమస్యలకు తాత్కాలికంగా కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ఈ సదస్సుల్లో అక్కడికక్కడే పరిష్కారం చెయ్యాల్సిన అంశాలను అక్కడే పరిష్కారం చెయ్యాలని, లేకపోతే ఎస్ఎల్ఏ గడువులోపు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మండల స్థాయి, క్రింది స్థాయి సిబ్బంది అందరూ ఈ సమావేశాలకు హాజరయ్యేలా చూడాలన్నారు. గ్రామాల్లో గ్రామ సభ నిర్వహణకు ముందు రోజే రెవెన్యూ సదస్సుల గురించి ప్రజలకు తెలిసేలా విస్తృత ప్రచారం చేయాలని, కరపత్రాలు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల నిర్వహణకు ఇది వరకే షెడ్యూల్ రూపొందించామన్నారు. ఈ అంశంపై ప్రజా ప్రతినిధులు, మండల స్పెషల్ ఆఫీసర్లు, ఎన్జీఓలతో కూడా సమావేశాలు నిర్వహించామన్నారు.. జిల్లాలో 472 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయని, అందులో రీసర్వే పూర్తి అయిన 254 గ్రామాల్లో గ్రామ సభలను నిర్వహించామన్నారు.గ్రామ సభల ద్వారా 18వేల దరఖాస్తులు వచ్చాయన్నారు..రెవెన్యూ సదస్సులను విజయవంతంగా నిర్వహించేందుకు వీలుగా అధికారులతో టీములు ఏర్పాటు చేశామన్నారు..తహశీల్దార్ తో ఒక టీమ్, డిప్యూటీ తహశీల్దార్ తో ఒక టీమ్ గ్రామాలకు వెళ్ళేలా షెడ్యూల్ రూపొందించామని కలెక్టర్ తెలిపారు. ఒక టీమ్ పూర్తిగా ఫీల్డ్ లో ఉంటే ఇంకొక టీమ్ ఆఫీస్ లో ఉండేలా షెడ్యూల్ రూపొందించామన్నారు. మండలానికి ఒక జిల్లా అధికారికి నోడల్ అధికారిని నియమించడం జరిగిందని కలెక్టర్ మంత్రికి వివరించారు. వీడియో కాన్ఫరెన్స్ జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలను తీర్చడానికే పొలం పిలుస్తోంది కార్యక్రమం

విశాలాంధ్ర - చాగలమర్రి : రైతుల సమస్యలను తీర్చడానికే ప్రభుత్వం పొలం పిలుస్తోంది కార్యక్రమం చేపట్టిందని మండల వ్యవసాయ అధికారి రంగనేతాజీ తెలిపారు. బుధవారం మండలంలోని మద్దూరు, మల్లె వేముల గ్రామాలలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రంగ నేతాజి గారు ప్రస్తుత వర్షాల నేపథ్యంలో వివిధ రకాల పంటలలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించడం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ మద్దూరు ,మల్లెవేముల గ్రామాల పరిధిలో శనగ, జొన్న పంట అధికంగా సాగు చేసారన్నారు. అధిక వార్షాల వల్ల పోలం లో నీరు నిలబడకుండా జాగ్రత్తలు పాటించి మురుగు నీటి కాల్వలు ద్వార బయటకు పంపించాలని తెలిపారు. శనగ పంటలో అధిక తేమ వలన మొదలు కుళ్ళు వచ్చే అవకాశం ఉన్నందున ట్రైకోడర్మ జీవన మందు లేదా కార్బెండ జిమాంకొజెబ్ మందు 2గ్రా/లీ నీటిలో కలిపి పిచికారి చేసుకోవలెనన్నారు. గాలులకు నేలవాలిన వరి పైరును కట్టలుగా కట్టుకోవాలని దాని ద్వార ధాన్యం గింజలు నీటిలో తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి తెలిపారు.అధిక

వర్షాలకు తడిచిన వరి ధాన్యంపై 5శాతం ఉప్పు ద్రావణం పిచికారి చేసుకోవాలని తద్వారా గింజలు మొలకరాకుండా అరికట్టవచ్చునని తెలిపారు. అదే విధంగా పంట భీమా కొరకు రైతులు తమ వాటా ప్రీమియం చెల్లించుటకు ఈ నెల 15 వరకు ఉన్నందున తప్పకుండా రైతులు మీ పరిధిలోని రైతు సేవా కేంద్రం నందు పంట వేసిన పత్రం, ఆధార్ మరియు బ్యాంకు పాసుబుక్ తీసుకుని మీ సేవా కేంద్రం లేదా సిఎస్‌సి నందు కాని చెల్లించవచ్చునని కోరడమైనది. రబీలో వేసిన పంటలను తప్పకుండా ప్రతి రైతు ఈ పంటలో నమోదు చేసుకోవాలని లేనిచో పంట భీమా వంటి ఇతర పథకములు వర్తించవని తెలిపారు.

దొంగలించిన ఇటుకలు, కంకరను రికవరీ చేయాలి

విశాలాంధ్ర - పెద్దకడబూరు : మండల కేంద్రమైన పెద్దకడబూరు గ్రామ శివారులో ఉన్న జగనన్న కాలనీలో ఇటుకలు, ఇసుక, కంకరను దొంగలించిన వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని ఎస్సీ సెల్ జిల్లా

కార్యదర్శి బొగ్గుల నరసన్న డిమాండ్ చేశారు. బుధవారం ఆయన జగనన్న కాలనీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న బేస్ మెంట్‌లో ఉపయోగించిన ఇటుకలు, ఇసుక, కంకరను దొంగతనానికి గురైనట్లు ఆయన తెలిపారు. నిర్మాణాలను అసంపూర్తిగా వదిలేయడంతోనే అధికారుల పర్యవేక్షణ, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్లే దొంగతనాలు జరిగాయన్నారు. తక్షణమే జిల్లా ఉన్నతాధికారులైన కలెక్టర్, హౌసింగ్ పీడీ, డీఈ స్పందించి జగనన్న కాలనీలో దొంగలించిన ఇటుకలు, ఇసుక, కంకరను రికవరీ చేసి చట్ట పరంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

కలిసి కలిసి భోజనం చేసిన వైస్‌ఛాన్స్‌లర్

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్ : రాయలసీమ యూనివర్సిటీ హాస్టళ్లలో పరిశుభ్రతకు పెద్దపీట వేయాలని విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య ఎన్.టి.కె. నాయక్ అధికారులను ఆదేశించారు. బుధవారం మధ్యాహ్న భోజన సమయంలో వర్సిటీ పురుషుల హాస్టళ్లలను ఆయన తనిఖీచేసారు. హాస్టల్లో పరిశుభ్రతకు కాపాడటంలో ప్రతి ఒక్కరూ బాధ్యతతో మెలగాలన్నారు. ప్రతిఒక్క విద్యార్థి తమతమ గదులను శుభ్రంగా ఉంచుకోవడంతోపాటు, హాస్టల్ పరిసరాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దడంలో సహకరించాలన్నారు. వంటశాలతోపాటు, డైనింగ్ హాల్, హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆహారం వృధా కాకుండా చూడటాలన్నారు. ఆదిశగా సరైన పర్యవేక్షణ చేయాలని హాస్టల్ అధికారులకు వి.సి. సూచించారు.

పప్పుశనగ పంటల పరిశీలన

విశాలాంధ్ర - కోడుమూరు : మండలంలోని రైతులు సాగుచేసిన పప్పు సెనగ పంటలను మండల వ్యవసాయ అధికారి ఎన్.రవి ప్రకాష్ రైతులతో కలిసి పరిశీలించారు. బుధవారం మండల వ్యవసాయ అధికారి ఎన్.రవిప్రకాష్ ఆధ్వర్యంలో మండలంలోని వెంకటగిరి గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రైతులతో కలిసి పప్పుశనగ పంటను పరిశీలించారు. మండలంలోని రైతులందరూ పప్పుశనగ, జొన్న వేసిన వారు తప్పకుండా ప్రీమియం కట్టుకొని ఇన్సూరెన్స్ వచ్చేటట్లు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్కె సిబ్బంది జయంత్,ప్రదీప్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

వేదవతి వంతెన మరమ్మతు చేయండి

విశాలాంధ్ర - హొళగుంద: మార్ల మడకి సమీపంలో ప్రవేశిస్తున్న వేదావతి నదిపై నిర్మించిన వంతెన మరమ్మతు చేయాలని బుధవారం ప్రజలు డిమాండ్ చేశారు. వంతెనేపై సిమెంటు దిమ్మెలు తొలగిపోయాయని, వర్షాకాలంలో వరద నీరు వంతెనపై పొంగిపోలిస్తే గుర్తుపట్టలేక పోతున్నామన్నారు. వంతెనపై సిమెంటు దిమ్మెలు ఉంటే వాహనాల రాకపోకలకు రక్షణగా ఉంటుందని, ఎలాంటి ప్రమాదం జరగవని వంతెన ఇరువైపుల ప్లాట్ఫారం దెబ్బతినిందన్నారు. గుంతలు ఏర్పడడం వల్ల వాహన రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందని ప్రజలు ఆరోపించారు. వంతెన నిర్మాణానికి అమర్చిన ఇనుప చువ్వలు బయటకు తేలాయని, వీటి వల్ల వాహనాలకు ఇబ్బంది కలుగుతుందని వాహనాల యజమానులు, డ్రైవర్లు అన్నారు. వంతెన ఇరువైపులా కంప చెట్లను, పిచ్చి చెట్లు విపరీతంగా పెరిగాయని వీటిని తొలగిస్తే రాకపోకలకు సులభం అవుతుందన్నారు. వంతెన అడుగుభాగంలో చెత్తచెదారం నిండిపోవడం వల్ల వర్షం నీరు, వరద నీరు వంతెనపై ప్రవహించడం వల్ల రోజుల తరబడి రాకపోకలు నిలిచిపోతాయని ప్రజలు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు వంతెన మరమ్మతు చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు.

సమస్యలను తీర్చడానికే పొలం పిలుస్తోంది

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : మండలంలోని చాబోలు గ్రామంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని టీడీపీ మైనారిటీ రాష్ట్ర నాయకులు ఇలియాస్ చేపట్టారు. ఈ సందర్భంగా మైనార్టీ సంక్షేమ, న్యాయ శాఖ మంత్రి ఫరూక్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ ఆదేశాల మేరకు చాబోలు గ్రామంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించిన్నట్లు ఇలియాజ్ తెలిపారు. సభ్యత్వం నమోదు చేసుకున్న వారికి ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. టిడిపి గ్రామ నాయకులు సద్దాం, తదితరుల కృషిశీల కార్యకర్తలు పాల్గొని, పలు కొత్త సభ్యులను పార్టీకి చేర్చడం ద్వారావిజయవంతం చేసినట్లు తెలిపారు.

మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి జైలు శిక్ష

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల పట్టణంలోని పద్మావతి నగర్ వద్ద నంద్యాల రెండవ పట్టణ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ చెకింగ్ చేయచుండగా మద్యం సేవించి వాహనం నడుపుతున్న నరసింహులు అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు సిఐ ఇస్మాయిల్ తెలిపారు. నంద్యాల సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రామభూపాల్ రెడ్డి ముందు హాజరుపరచగా జడ్జి ముద్దాయికి 15 రోజులు జైలు శిక్ష విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు సిఐ తెలిపారు. ఈ సందర్భంగా రెండవ పట్టణ ఇన్స్పెక్టర్ ఇస్మాయిల్ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనం నడపడం చట్టరీత్యా నేరమని, మద్యం సేవించి వాహనం నడపడం వలన రోడ్డు ప్రమాదాలు జరిగి మరణించే అవకాశం ఉందని, కావున మద్యం సేవించి వాహనం నడపరాదని విజ్ఞప్తి చేశారు.

పేరు ప్రఖ్యాతలు సంపాదించిన వ్యక్తి మద్దూరు సుబ్బారెడ్డి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - నందికొట్కూరు: దేశ, రాష్ట్ర రాజకీయాల్లో మాట తప్పని, మడమ తిప్పని నేత విలువలతో కూడిన రాజకీయాలు చేసిన వ్యక్తి రాష్ట్రంలో పేరు ప్రఖ్యాతలు సంపాదించిన ఏకైక రాజకీయ నాయకుడు దివంగత మాజీ నంద్యాల పార్లమెంట్ సభ్యుడు మద్దూరు సుబ్బారెడ్డి అంటూ ఎమ్మెల్యే గిత్త జయసూర్య కొనియాడారు. బుధవారం మండల పరిధిలోని బ్రాహ్మణ కొట్కూరు గ్రామంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాజీ పార్లమెంటు సభ్యులు, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ దివంగత మద్దూరు సుబ్బారెడ్డి 112వ జయంతి మరియు పాఠాశాల 63వ వార్షికోత్సవ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే గిత్త జయసూర్యతో పాటు మద్దూర్ వంశస్థులైన మద్దూరు హరి సర్వోత్తమ రెడ్డిలు హాజరయ్యారు. ముందుగా ఎమ్మెల్యే చదువుల తల్లి సరస్వతీ విగ్రహానికి పూజలు నిర్వహించారు. అనంతరం దివంగత

మద్దూర్ సుబ్బారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిత్త జయ సూర్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలోని విద్యార్థినీ విద్యార్థులు విద్యను అభ్యసించాలనే ఉద్దేశంతో రాష్ట్రంలో 324 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను స్థాపించి వాటికి పునాది వేసి శంకుస్థాపన చేశారని ఆ మహానుభావుని ద్వారా నేడు మన విద్యను అభ్యసిస్తున్నామని విద్యార్థులకు గుర్తు చేశాడు. అధికారంలో ఉన్న లేకపోయినా ప్రజల కోసం పాటుపడే ఏకైక వ్యక్తి, ప్రజాభిమానాన్ని సంపాదించిన వ్యక్తి నిజాయితీ, నిబద్ధత మద్దూరు సుబ్బారెడ్డిదే అన్నారు. శాసనమండలిలో ఏకగ్రీవ సభ్యుడుగా ఎన్నికైన వ్యక్తి మద్దూరు సుబ్బారెడ్డి అన్నారు. గ్రామాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రభుత్వ వైద్యశాలను ఏర్పాటు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. గ్రామ సర్పంచ్ పదవి నుంచి మండల సమితి ప్రెసిడెంట్, జిల్లా పరిషత్ చైర్మన్, శాసనమండలి సభ్యుడు, పార్లమెంట్ సభ్యుడుగా అంచెలంచలుగా ఎదిగి రాష్ట్ర రాజకీయాల్లో కాకలు తిరిన యోధుడిగా పేరు సంపాదించు కున్నారన్నారు. మాజీ సింగిల్ విండో సొసైటీ చైర్మన్ సర్వోతమ రెడ్డి,మాజీ ఎంపిటిసి ఖాజా మొహిద్దీన్, జడ్పీటీసీ కరీమున్నిసా, మాజీ ఎంపిపి వీరం ప్రసాద్ రెడ్డి, మిద్దూర్ మండల కన్వీనర్ ఖాతా రమేష్ రెడ్డి, రాష్ట్ర యాదవ సంఘ డైరెక్టర్ కడియం వెంకటేశ్వర్లు యాదవ్, పగిద్యాల కన్వీనర్ పలుచాని మహేశ్వర్ రెడ్డి, సర్వోతమ రెడ్డి, తలముడి వంగాల సిద్ధారెడ్డి, మాజీ సర్పంచ్ ఖలీల్ భేగ్, రఘురెడ్డి, రామిరెడ్డి పాల్గొన్నారు.

వైద్యశాల పరిపాలన విభాగంలో ఆకస్మిక తనిఖీ



విశాలాంధ్ర - కర్నూలు వైద్యశాల: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల పరిపాలన విభాగాన్ని హాస్పిటల్ పర్యవేక్షకులు డాక్టర్ కె.వెంకటేశ్వర్లు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రి లోని పరిపాలన విభాగంలో మినిస్ట్రీయల్ స్టాఫ్ విధులు నిర్వహిస్తున్న సీట్ల దగ్గర పోయి వారి వివరాల గురించి ఏవో మరియు అకౌంటెంట్ ద్వారా ఆరా తీశారు. అనంతరం వారు ఏ సమయంలో వస్తున్నారు, ఎఫ్ఆర్ఎస్, అటెం డెన్స్ రిజిస్టర్, రికార్డులను పరిశీలించి ఫిర్యాదుదారుల ఫిర్యాదులపై సరైన రీతిలో క్షుణ్ణంగా పరిశీలించి నిర్దిష్ట సమయంలో పరిష్క రించాలని సిబ్బందికి ఆదేశించారు.కోర్టు కేసులు, ఇతర కేసులు ఏవైనా ఉంటే నిర్లక్ష్యం చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆసుపత్రి సిబ్బంది సమయపాలనలో ఉండేటట్లు చూసుకోవాలని అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌ను ఆదేశించారు. ఆసుపత్రి సిబ్బంది విధి నిర్వహణలో ఎవరైనా బయటికి వెళ్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి ఆసుపత్రి పరిపాలన విభాగపు అధికారి శ్రీనివాసులు, అకౌంటెంట్ లతీఫ్ బేగ్, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

న్యూ విశ్వవాణి పాఠశాలలో పరఖ్ పరీక్ష

విశాలాంధ్ర - కోడుమూరు: పట్టణంలోని న్యూ విశ్వవాణి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ నందు విద్యాశాఖ

ఆధ్వర్యంలో విద్యార్థులకు పరఖ్ పరీక్షను నిర్వహించారు. బుధవారం పాఠశాలలో చదువుతున్న 9వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన పరీక్షకు కర్నూలు నుంచి అబ్జర్వర్ నారాయణ ఇన్విజిలేటర్‌గా హాజరయ్యారు. పరీక్ష కేంద్రాన్ని మండల విద్యాధికారిణి వసంత లక్ష్మి భాయ్ తనిఖీ చేసి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ పరీక్ష ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న సామర్థ్యాన్ని వెలుగు తీసేందుకు ఉపయోగపడుతుందని ఎంఈఓ వసంతలక్ష్మి భాయ్ తెలిపారు. విద్యార్థులంతా పరీక్షలు బాగా రాయాలని మండల విద్యాధికారిణి సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఖలీల్, డైరెక్టర్ శ్రీనివాసులు, హెడ్మాస్టర్ గిడ్డయ్య ఉపాధ్యాయులు రాబియా, రెహనా, ఈశ్వర్, భారతి, నస్రీన్, సీఆర్పీ సుధాకర్ పాల్గొన్నారు.

గజ్జహళ్లి రోడ్డు పనులు ప్రారంభం

విశాలాంధ్ర - హొళగుంద: మండలంలోని గజ్జహళ్లి నుండి సిరుగుప్ప క్రాస్ వరకు అధ్వానంగా ఉన్న రోడ్డు పనులను బుధవారం ఆర్ అండ్ బీ అధికారులు ప్రారంభించారు. రోడ్డు అధ్వాన్నంగా ఉందని రోడ్డు మొరమత్తు చేయాలంటూ జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి సి.రామలింగ రాష్ట్ర సచివాలయంలో ఫిర్యాదించారు. ఫిర్యాదుకి స్పందించిన అధికారులు 6 కిలోమీటర్ల వరకు రోడ్డు మొరమత్తు నిర్మాణానికి రూ.62 లక్షలను విడుదల చేశారు. రోడ్డు పనులను ప్రారంభించబడిన కూటమి నాయకులు గిరి మల్ల, రామ, రామలింగ, స్వామి హర్షం వ్యక్తం చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం రోడ్డు మరమ్మతు జరగలేదని, ఇప్పుడు జరుగుతుందన్నారు. రోడ్డు బాగుపడితే ప్రజలకు ఎంతో అనుకూలమవుతుందని అన్నారు. అధికారులు రోడ్డు పనులను నాణ్యతతో నిర్మించాలని కోరారు. కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రాంలింగకు ఆర్ అండ్ బీ అధికారులకు పత్రాన్ని అందించారు.

వైభవంగా అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : మండలంలోని కనకాద్రి పల్లి గ్రామంలో అయ్యప్ప స్వామి ఆలయ 9వ వార్షికోత్సవంను బుధవారం అయ్యప్ప మాల దారులు, భక్తులు, ప్రజలు అంగరంగ

వైభవంగా నిర్వహించారు. ఆయా గ్రామాల అయ్యప్ప మాల దారులు తరలివచ్చారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. భారీగా తరలి వచ్చిన భక్తులు స్వామివారికి అభిషేకాలు హెూమాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం గావించారు.

అండర్ పాస్ రోడ్లకు సహకరించండి : ఎంపీ

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : జిల్లాలో జాతీయ రహదారుల నిర్మాణంలో కొన్ని గ్రామాలకు వెళ్లేందుకు కేవలం రోడ్డు దాటడానికి 5 కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరం ప్రయాణించాల్సి వస్తుందని, హైవేలకు సంబంధించి అండర్ పాస్‌లు ఏర్పాటు చేయాలని కోరుతూ బుధవారం ఢిల్లీలో కేంద్ర జాతీయ రహదారుల మంత్రి నితిన్

గట్కారీని ఎంపీ శబరి ఆయన కార్యాలయంలో కలిసి విన్నవించారు. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న జాతీయ రహదారుల పనులు వేగవంతం చేసి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి సహకరించాలని ఆమె కోరారు. జిల్లాలో జాతీయ రహదారుల నిర్మాణం పనుల పురోగతి, భూసేకరణ, రైతుల నష్టపరిహారం సమస్యలు కేంద్ర జాతీయ రహదారుల మంత్రి నితిన్ గట్కారి దృష్టికి తీసుకెళ్లినట్లు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి చెప్పారు.

పీఎం సూర్య ఘర్ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర - రుద్రవరం : ప్రతి విద్యుత్ వినియోగదారుడు ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆళ్లగడ్డ ట్రాన్స్‌కో ఏడిఈ రవికాంత్ చౌదరి అన్నారు. బుధవారం మండల కేంద్రం లోని విద్యుత్ కార్యాలయంలో విద్యుత్ సిబ్బందితో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా కోటి ఇళ్లకు ఉచిత కరెంటును అందించె దిశగా ప్రధాని మోదీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ పథకం గృహ వినియోగదారులకు మాత్రమే వర్తిస్తుందన్నారు. సొంత ఇల్లు కలిగిన ప్రతి విద్యుత్ వినియోగదారుడు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇంటి పైకప్పులపై సౌర పలకలను ఏర్పాటు చేసుకొని విద్యుత్ ను ఆదా చేసుకోవాలన్నారు. సౌర విద్యుత్ వాడడం వల్ల 300 యూనిట్ల వరకు విద్యుత్ ఛార్జీలు మినహాయింపు ఉంటుందన్నారు. ఈ పథకం 2023-24 సంవత్సరం నుండి 2026-2027 వరకు అందుబాటులో ఉంటుందన్నారు. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలంటే పీఎం సూర్య ఘర్ యోజన స్కీం అఫీషియల్ వెబ్సైట్లో పేరు నమోదు చేసుకోవాలన్నారు. ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాలంటే ఇల్లు, విద్యుత్ కనెక్షన్ దరఖాస్తు దారుని పేరు మీదనే ఉండాలన్నారు. ఈ పథకంలో భాగంగా ఇంటిపై ఏర్పాటు చేసుకునే సోలార్ సిస్టం ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్తులో మొదటి 300 యూనిట్లు లబ్ధిదారులు ఉచితంగా వాడుకోవచ్చని మిగిలిన 600 యూనిట్ లను నెట్ మీటరింగ్ ద్వారా అమ్ముకోవచ్చన్నారు. మూడు కిలోవాట్ల సౌర విద్యుత్ కేంద్రం ఏర్పాటు చేయడానికి 1.45 లక్షలు ఖర్చు అవుతుందని 78 వేల రూపాయలు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందన్నారు. ఒక కిలో వాట్ నుండి 10 కిలో వాట్ల వరకు సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వం మాత్రం మూడు కిలోవాట్లకు మించి చేసుకున్న సోలార్ వ్యవస్థ ఏర్పాటుకుగరిష్టంగా 78,000 మాత్రమే సబ్సిడీ వినియోగ దారునికి చెల్లించడం జరుగుతుందన్నారు. నియోజకవర్గం లోని సిరివెళ్ల మండలం గోవింద పల్లె గ్రామాన్ని మన రాష్ట్ర ప్రభుత్వం సూర్య ఘర్ యోజన పథకం కింద ఎంపిక చేసిందన్నారు. దరఖాస్తు ఫీజు ఉచితమని పూర్తి వివరాల కోసం దగ్గరలో ఉన్న విద్యుత్ కార్యాలయ అధికారులను సంప్రదించాలన్నారు.

అమర గాయకులు ఘంటసాల జయంతి

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ: అమర గాయకులు, కీర్తిశేషులు ఘంటసాల వెంకటేశ్వరరావు 102వ జయంతి వేడుకలు ఆళ్లగడ్డలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా లలిత కళా సమితి వ్యవస్థాపకుడు బిజ్జంవెంకటేశ్వర ఆధ్వర్యంలో ఎద్దుల పాపమ్మ కాలేజీ ఎదురుగా ఘంటసాల చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా రిటైర్డ్ జడ్జి శివ ప్రసాద్ హాజరై గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు గురించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరెడ్డి, బాలీశ్వర్ రెడ్డి, నరసయ్య, పుల్లయ్య, సంజీవరెడ్డి, నారపురెడ్డి, ఆనందు, నాగరాజు, మురార్జీ, పాము లేటి, మౌలాలి, వివేకానంద శివప్రసాద్, నాగేశ్వరుడు, రామచంద్రుడు, జమాల్ బాషా, సుదర్శనం, సుభాష్ రెడ్డి, శంకరయ్య, భాస్కరు తదితర అభిమానులు పాల్గొన్నారు.

దర్గా కాలనీ ప్రజల సమస్యలు తీరుస్తాము

విశాలాంధ్ర - హొళగుంద: ఎల్లార్తి షేక్షావలి దర్గా కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తీరుస్తామని సర్పంచ్ కురువ చాముండేశ్వరి అన్నారు. దర్గా కాలనీలో సర్పంచ్ నిధులతో కొత్త మంచి నీటి పైప్లైన్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కురువ చాముండేశ్వరి మాట్లాడుతూ అందరి సహకారంతో గ్రామాభి వృద్ధి చేపట్టామని అన్నారు. ఎన్నో ఏళ్ల నుండి కాలనీ ప్రజలకు మంచి నీరు అందేవి కావని ప్రజల విజ్ఞప్తి మేరకు కొత్త పైప్లైన్ పనులు ప్రారంభించి మంచినీటి సరఫరా చేస్తామని, ప్రజలు నీటిని వృధా చేయద్దని పొదుపుగా వాడుకోవాలని కోరారు. గ్రామాభివృద్ధికి అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పైప్లైన్ పనుల ప్రారంభ కార్య క్రమంలో వైసీపీ నాయకులు ఎస్కె గిరి, కుర్వ దర్గప్ప, ఈరన్న పాల్గొన్నారు.

మోమిన్ మునీర్ బాషకు సన్మానం

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్ : ఆత్మకూరు దివంగత సర్పంచ్ ఎం.ఎ.కె.జీలానీ కుమారుడు మోమిన్ మునీర్ బాషా కుటుంబ సమేతంగా పవిత్ర ఉమ్రా యాత్ర (మక్కా యాత్ర) కు వెళుతున్న సందర్భంగా మోమిన్ హుసేన్ సాబ్ అంజుమన్ కమిటీ చైర్మన్ మోమిన్ ఇబ్రాహీం ఖలీలుల్లా ఆధ్వర్యంలో శాలువా కప్పి సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రైతు సేవా సంఘం అధ్యక్షుడు బైరాపురం రహమాన్, క్రుషి పండ్ల తోటల అధ్యక్షులు బైరాపురం బాషా, నశం షఫీవుల్లా, జమాత్ ఖాన్, బెజ్జం నబిసా, గుడ్డి ఇబ్రాహీం, రహంతుల్లా, దాదా రఫీక్, శిఖామణి, అహ్మద్, షేక్ అన్వర్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి రెవెన్యూ సదస్సులు

విశాలాంధ్ర-అవుకు : భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు మండల తహసిల్దార్ సువర్ణాదేవి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 6వ తేదీ నుండి జనవరి 4వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని అన్నారు. 6న రామాపురం,7న సంఘ పట్నం, 10 న చనుగొండ్ల, 11న సుంకేసుల, 12న అవుకు, 13న గుండ్ల సింగవరం, 17న రామవరం, 18న జూనూతల, 19న ఉప్పలపాడు, 20న కునుకుంట్ల, 21న మంగంపేట, 24న అన్నవరం, 26న వేములపాడు, 27న నిచ్చెన మెట్ల, 28న మెట్టుపల్లి, జనవరి 2వ తేదీన శివవరం,3న సింగనపల్లి, 4న నిచ్చెన మెట్ల గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని అన్నారు. రైతులు ఈ రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

ఎస్టీ సాధనే ఏకైక లక్ష్యం

విశాలాంధ్ర-గూడూరు: ఎస్టీ హెూదా సాధనే ఏకైక లక్ష్యమని గూడూరు పట్టణ వాల్మీకి సంఘం నూతన కమిటీ అధ్యక్షుడు పుట్టపాశం రామాంజనేయులు, కోశాధికారి కురుకుంద విజయ్, సభ్యులు మూలగేరి మద్దిలేటి అన్నారు. బుధవారం స్థానిక వాల్మీకి దేవాలయంలో కొత్తగా ఎన్నికైన వాల్మీకి సంఘం కమిటీ సభ్యులను గ్రామ వాల్మీకి పెద్దలు పూలమాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ గూడూరు పట్టణంలోని వాల్మీకి సోదరులకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ పెద్దల సమక్షంలో సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు సాగుతామని అన్నారు. ఎస్టి హెూదా సాధించేందుకు ప్రతి ఒక్కరూ ఉద్యమ బాట పట్టాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్ కే రామాంజనేయులు కౌన్సిలర్ సురేష్, దస్తగిరి, ఉపాధ్యక్షుడు కొండిగేరి గిడ్డయ్య, వాల్మీకులు మూలగేరి రంగడు,ఎస్ ఈ భాస్కర్, ఉగ్ర నరసింహులు తదితరులు ఉన్నారు.

ఘనంగా పద్మశ్రీ ఘంటసాల జయంతి

విశాలాంధ్ర - ఆదోని రూరల్ : అమర గాయకుడు పద్మశ్రీ గ్రహీత సినీ సంగీత ఘంటసాల వెంకటేశ్వరరావు 102వ జయంతి వేడుకలు బుధవారం బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఘంటసాల సప్త స్వరాల కళా సమితి ఆధ్వర్యంలో గౌరవ అధ్యక్షులు టి.ఆంజనేయులు, అధ్యక్షులు బి.నీలకంఠప్ప, ప్రధాన కార్యదర్శి ఎండి. బసవరాజు స్వామి, ఉపాధ్యక్షులు సాకేరే మల్లేశ్వరరావు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ 1922 డిసెంబర్ 4 కృష్ణాజిల్లా చౌటుపల్లి గ్రామంలో రత్నమ్మ, సూర్యనారాయణ ల దంపతులకు ఘంటసాల జన్మించాడని గుర్తు చేశారు. తండ్రి ఆశయాలకు అనుగుణంగా సంగీత సాధనలో అనేక కష్టనష్టాలతో శాస్త్రీయ సంగీతం శిక్షణతో తెలుగు సినీ సంగీత ప్రపంచంలోనే ఎనలేని సేవలు చేసి, ప్రపంచ ప్రఖ్యాతి పొందారున్నారు. భారత ప్రభుత్వం సేవలను గుర్తిస్తూ 1970లో పద్మశ్రీ అవార్డుతో సత్కరించారన్నారు. 2003లోనే పోస్టల్ స్టాంప్‌లను విడుదల చేయడం జరిగిందన్నారు. చిన్నపిల్లల నుండి వృద్ధుల వరకు ఘంటసాల గాయాన్ని భగవద్గీత ప్రతిరోజు స్మరిస్తూ ప్రేక్షక హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని పేర్కొన్నారు. ఘంటసాల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తూ, చేసిన సేవలను గూర్చి కొనియాడారు. కార్యక్రమంలో ఘంటసాల సప్త స్వరాల కళా సమితి నాయకులు ఫిరోజ్ అహ్మద్, చంద్రశేఖర్ రెడ్డి, మురలీధర్ గౌడ్, సాయినాథ్, రాముడు, దాదా బాష తదితరులు ఉన్నారు.